క్లుప్తంగా

29న ఐడీపీఎస్‌లో వైజ్ఞానిక ప్రదర్శన

చెరుకుపల్లి: ఈ నెల 29న లీప్ డే సందర్భంగా ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో స్టేజ్ ఫెయిర్‌తో పాటు ఎగ్జిబిషన్ నిర్వహించ బడుతుందని పాఠశాల చైర్మన్ పైనం ఏడుకొండలరెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రత్యేకంగా స్పేస్ ఫెయిర్ మరియు మినీ నక్షత్ర శాల నిర్వహిస్తున్న పాఠశాల ఐడీపీఎస్ అని అన్నారు. ఎగ్జిబిషన్‌లో భాగంగా ప్రత్యక్ష రాకెట్ ప్రయోగం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేశామన్నారు. మినీ నక్షత్ర శాలలో భాగంగా సౌర వ్యవస్థలో సాహసాలు, వన్ వరల్డ్ వన్ స్కై, పాలపుంత గెలాక్సీ యొక్క రహస్యాలు సహా వివిధ అంశాలపై విద్యార్థుల చేత తయారు చేయబడిన నమూనాలు ప్రదర్శించటం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొనాలని కోరారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం



భట్టిప్రోలు: భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని వితలేశ్వరస్వామి దేవాలయానికి చెందిన మాన్యాన్ని ఆనుకొని ఉన్న కాల్వకట్ట వద్ద మంగళవారం ఉపాధి హామీ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేందుకు గ్రామ సర్పంచ్ దారా రవి కిరణ్మయి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జేబీవీ మల్లికార్జున రావు, పంచాయతీ వార్డు సభ్యులు కొలుసు శేషమ్మ, కట్టా మల్లేశ్వరి, ఎన్ఆర్ఈజీఎస్ జేఈ సుధాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ పి.అనీల్, టెక్నికల్ అసిస్టెంట్ సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరాలను వినియోగించుకోండి



కొల్లూరు : పేద వర్గాలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కొల్లూరు ఎంపీడీఓ లక్ష్మీకుమారి కోరారు. మంగళవారం మండలంలోని ఈపూరులంకలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. శిబిరంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 282 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కొల్లూరు పీహెచ్‌సీ వైద్యులు రోగులను పరీక్షించి వైద్య సేవలు అందించారు.

కోనేటిపురం సచివాలయానికి అవార్డుల పంట



భట్టిప్రోలు: జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా గ్రామీణ స్థాయిలో ఘన వ్యర్థాల నిర్వహణలో మెరుగైన పని తీరు కనబరచిన భట్టిప్రోలు మండలం కోనేటిపురం సచివాలయానికి పలు అవార్డులు దక్కాయి. మంగళవారం గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఐటీసీ సౌజన్యంతో అవార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా సచివాలయ పరిధిలోని పి. ప్రదీప్ కుమార్ (ఆళ్లమూడి కార్యదర్శి), ఉత్తమ గ్రామ సర్పంచ్‌గా మోర్ల వెంకటేశ్వరమ్మ (కోనేటిపురం), ఉత్తమ క్లాప్ మిత్రగా పడమట నాగమల్లేశ్వరరావు, ఉత్తమ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా బి. విజయసారథి(కోనేటిపురం)లు ఎంపికయ్యారు. వీరంతా అవార్డులను ఐటీసీ ప్రతినిధుల చేతుల మీదుగా అందుకున్నారు. వీరిని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, ఎంపీడీవో జేబీవీ మల్లికార్జునరావు, ఈవోపీఆర్డీ టి.ఊహారాణిలు అభినందించారు.

మున్సిపల్ కమిషనర్‌గా శేషాద్రి

రేపల్లె రూరల్: రేపల్లె మున్సిపల్ కమిషనర్‌గా బీఆర్ఎస్ శేషాద్రిని నియమిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తూ ఎన్నికల బదిలీల్లో భాగంగా ఈయన రేపల్లె వచ్చారు. రేపల్లె మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న టి.రామబో పాల్‌రెడ్డి నిడదవోలుకు బదిలీ అయ్యారు.

ముగ్గురు జూదరులు అరెస్టు

ప్రత్తిపాడు: కోతముక్కాట ఆడుతున్న ముగ్గురు జూదరులను ప్రత్తిపాడు పోలీసులు అరెస్టు చేశారు. గ్రామశివారులో రహస్యంగా కోత ముక్కాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న ఎస్ఐ వి.సోమేశ్వరరావు సిబ్బందితో కలిసి జూదస్థావరంపై దాడి చేసి కోత ముక్కాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోనికి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 4,060లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాల కోటేశ్వరస్వామి తిరునాళ్లకు ముమ్మర ఏర్పాట్లు

ఉత్సవ నిర్వహణపై అధికారుల సమాలోచనలు



ఉత్సవాల ఏర్పాట్లపై సమావేశమైన వివిధ శాఖల అధికారులు

రేపల్లె రూరల్: అధికారులు సమన్వయంతో పని చేసి బాల కోటేశ్వర స్వామి తిరునాళ్ల ఉత్సవాలను జయప్రదం చేయాలని తహసీల్దార్ చొప్పా రవీంద్రబాబు సూచించారు. మండలంలోని అరవపల్లి గ్రామంలో వేంచేసి యున్న శ్రీ బాలకోటేశ్వర స్వామి ఆలయంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం తిరునాళ్ల ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అరవపల్లిలో 7, 8, 9 తేదీలలో నిర్వహించే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసేలా అధికారులను అప్రమత్తం చేశారు. తిరునాళ్లకు పాత గుంటూరు జిల్లాతో పాటు సమీపంలోని కృష్ణా, ప్రకాశం జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చేందుకు అవకాశం ఉందన్నారు. పోలీసు అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి భక్తులకు సూచనలిచ్చే కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఎటువంటి అపశృతులు చోటు చేసుకోకుండా తిరునాళ్లను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని చెప్పారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. వైద్యాధికారులు తిరునాళ్లలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల్లో అందుబాటులో ఉండాలన్నారు. తిరునాళ్లలో ప్రభలు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున ముఖ్యంగా విద్యుత్‌శాఖ అధికారులు అందుబాటులో ఉండాలని, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. అగ్నిమాపక అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. వేడుకల్లో భక్తులకు ప్రసాదాలు అందించే స్వచ్ఛంద సేవా సంస్థలు దేవస్థానం కేటాయించిన ప్రదేశాలలో స్టాళ్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీనికిగానూ తప్పనిసరిగా అనుమతులు పొందాలని చెప్పారు. ఆలయ అధికారులు భక్తులకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసన్న కుమారి, ఆలయ పర్యవేక్షణ అధికారి రాజేశ్వర రావు, ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేటపాలెం వైద్యాధికారిపై చర్యలకు డిమాండు



వినతి పత్రం అందజేస్తున్న ఉద్యోగులు

బాపట్ల: చీరాల డివిజన్‌లోని వేటపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె.బాలరాజుపై చర్యలు తీసుకోవాలని వైద్యశాఖ సిబ్బంది మంగళవారం ప్రదర్శన చేపట్టారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ విజయమ్మకు వినతి పత్రం అందజేశారు. బాలరాజు వేధింపులతో వైద్య సిబ్బంది మానసిక వొత్తిడికి గురౌతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. మూడునెలల క్రితం ఆయనను విచారణ చేసేందుకు విచారణ అధికారిగా వేసిన జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రిపోర్టును పరిశీలించి అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు సీహెచ్ శేషుబాబు, సిబ్బంది ఉన్నారు.

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో పని చేసే ఉద్యోగులు మంగళవారం గ్రీవెన్స్‌ను వినియోగించుకున్నారు. జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ విజయమ్మకు వినతి పత్రాలు ఇచ్చారు. మొత్తం 16 వినతి పత్రాలు అందగా వాటిలో నాలుగు ఆర్థిక పరమైనవి కాగా మిగిలినవి సర్వీసుకు సంబంధించిన సమస్యలని తెలిపారు. గ్రీవెన్స్‌లో జిల్లా వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

పేటేరు పంచాయతీకి స్వచ్ఛ సంకల్పం పురస్కారం



ప్రశంసా పత్రం అందుకుంటున్న పేటేరు సర్పంచ్ కనపర్తి వసుమతి

రేపల్లె రూరల్: జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మేజర్ పంచాయతీ పేటేరుకు అవార్డు లభించింది. మంగళవారం గుంటూరులోని పంచాయతీరాజ్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఎన్జీవో సంస్థల ప్రతినిధుల నుంచి పేటేరు సర్పంచ్ కనపర్తి వసుమతి, కార్యదర్శి పుష్పకుమారిలు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. స్వచ్ఛ సంకల్పంలో భాగంగా గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుదలకు కృషి చేసిన వీరికి అవార్డు లభించటం ఆనందంగా ఉందని సర్పంచ్ వసుమతి, కార్యదర్శి పుష్పకుమారిలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండలంలోని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు వీరికి అభినందనలు తెలిపారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం



ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఎంఈఓ డి.బలిరాం, సయ్యద్ సుభాని

పెదకాకాని: విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని మండల విద్యాశాఖాధికారి డి.బలిరాం అన్నారు. మండలంలోని నంబూరు ఉర్దూ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు భోజనం ప్లేట్లు, గ్లాసులు ఉపాధ్యాయులకు వారి కోరిక మేరకు జాతీయ నాయకుల చిత్రపటాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఈఓ డి.బలిరాం మాట్లాడుతూ విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల కమిటీలు, గ్రామపెద్దలు భాగస్వాములు కావాలన్నారు. జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుభాని మాట్లాడుతూ ప్రభుత్వం మన బడి నాడు నేడు పథకం ద్వారా రూ.20 లక్షలతో పాఠశాలను అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్యలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఉపాధ్యాయులు సయ్యద్ షహజాది, సీఆర్పీ ప్రసన్న, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ ఇస్మాయిల్, ఎండీ బుర్హానుద్దీన్, పేరంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామీణులకు ఫ్యామిలీ డాక్టర్ సేవలు



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ లక్ష్మీసుధ

దావులూరు(కొల్లిపర): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి చిక్కాల లక్ష్మీసుధ అన్నారు. మంగళవారం మండలంలోని దావులూరు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 150 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి తగు జాగ్రత్తలు, పౌష్టిక ఆహారం ఏ మేరకు తీసుకోవాలన్న అంశాలను వివరించారు. గ్రామంలో మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు తెలిపి వారికి కావాల్సిన మందులు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారుల ఎత్తు, బరువు పరీక్షలు చేసి రక్తహీనత ఉన్న వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నాగమల్లేశ్వరరావు, 104 సిబ్బంది కోటిరెడ్డి, ఏఎన్ఎంలు, పాల్గొన్నారు.

బ్యాంక్‌లోన్ ఇప్పిస్తానంటూ మోసం

చికెన్ షాపు నిర్వాహకుడి వద్ద నుంచి రూ.15వేలు నగదు కాజేసిన యువకుడు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం రోడ్‌లో ఓ చికెన్ షాప్ యజమానికి లోన్ ఇప్పిస్తానంటూ ఓ వ్యక్తి మోసం చేసి ఆయన ఖాతాలో డబ్బులను మాయం చేసి పరారైన ఘటన వెలుగు చూసింది. మంగళవారం చికెన్ షాప్ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళగిరి పోలీసులు తాడేపల్లి పోలీసులను అప్రమత్తం చేయడంతో ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. సేకరించిన వివరాల ప్రకారం తాడేపల్లి పోలకంపాడుకు చెందిన శ్రీనివాసరావు అనే చికెన్ వ్యాపారి మంగళగిరి యర్రబాలెం రోడ్‌లో చికెన్ షాపు నడుపుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తన పేరు సాయి సందీప్‌గా తాను బ్యాంకులో పనిచేస్తున్నానని పర్సనల్ లోన్ ఇప్పిస్తానని చెప్పి శ్రీనివాసరావును నమ్మించాడు. శ్రీనివాసరావును మాటల్లో పెట్టి తన వద్ద ఉన్న ఆండ్రాయిడ్ ఫోన్ తీసుకుని శ్రీనివాసరావు అకౌంట్‌లో ఉన్న రూ.15 వేల నగదును ఫోన్‌పే ద్వారా కృష్ణాజిల్లా పోరంకికి చెందిన మొక్కపాటి నాగ ఫణీంద్రకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. అనంతరం అక్కడి నుంచి సాయి సందీప్ బండిపై ఉడాయించాడు. ఖాతా నుంచి ఫోన్‌పే ద్వారా రూ.15 వేలు వేరే ఫోన్ నెంబర్‌కు బదిలీ అయిన విషయం గమనించిన శ్రీనివాసరావు పోలీసులను ఆశ్రయించగా శ్రీనివాసరావు ఫోన్ నుంచి నగదు బదిలీ చేసిన నెంబర్‌ను సంప్రదించారు. తన పేరు నాగ ఫణీంద్ర అని, ఫణీంద్ర ఫోన్ పేకు సాయి సందీప్ డబ్బులు పంపాడని, తిరిగి సాయి సందీప్‌కు డబ్బులు చెల్లించానని తెలపడంతో ఫణీంద్ర ఇచ్చిన సమాచారం మేరకు తాడేపల్లి పోలీసులను అప్రమత్తం చేశారు. ద్విచక్రవాహనంపై వెళుతున్న సాయి సందీప్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నిందితుడి వద్ద నుంచి మరింత సమాచారం సేకరిస్తున్నట్లు సీఐ మధుసూదనరావు తెలిపారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

చెరుకుపల్లి: జిల్లాలోని బాలికల గురుకుల పాఠశాలలో ఆంగ్ల మాధ్యమ బోధనలో ఐదో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీఆర్ఎస్ జిల్లా కన్వీనర్ వి స్వరూపారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కావూరు బాలికల గురుకుల పాఠశాలలో 2024-25 సంవత్సరానికి గానూ ఐదో తరగతి ప్రవేశాలకు 80 ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తి గల వారు మార్చి 1 నుంచి 31 లోపు మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నిత్యావసర సరకులు అందజేత

కర్లపాలెం: వేసవికాలంలో అగ్ని ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని రెడ్‌క్రాస్ సొసైటీ కర్లపాలెం మండల అధ్యక్షుడు ఇనకొల్లు పోలీస్‌రావు సూచించారు. కర్లపాలెం పంచాయతీ లంక కాలువ కట్టపై నివసిస్తున్న గోసాని సాంబయ్య పూరిల్లు ప్రమాదవశాత్తు ఇటీవల దగ్ధమవడంతో మంగళవారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బాధితుడికి టార్పాలిన్ పట్టా, వంట పాత్రలు, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు ఏకసిరి నరసింహారావు, గంపాల వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

విధుల పట్ల అంకిత భావం ఉండాలి



చెరుకుపల్లి: విధి నిర్వహణలో అంకిత భావంతో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి గుర్తింపు, గౌరవం దక్కుతుందని మండల పరిషత్ అధ్యక్షుడు మత్తి దివాకర రత్న ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించినందుకు గానూ మండలంలో ముగ్గురుకి జిల్లా పరిషత్ అధికారులు ఉత్తమ అవార్డులతో సత్కరించటం అభినంద నీయమన్నారు. బాపట్ల ఉత్తమ డివిజనల్ అధికారిగా తాతా శివశంకర రావు, పొన్నపల్లి పంచాయతీ కార్యదర్శిగా జానకి రామయ్య, చెరుకుపల్లి గ్రామ పంచాయతీకి చెందిన కొత్రా నాంచారయ్యను ఉత్తమ పంచాయతీ రాయబారిగా ఎంపిక చేసి అవార్డులు, మెమొంటోలతో మంగళవారం సత్కరించారు. వీరి ముగ్గురుకి అవార్డులు రావటం పట్ల జెడ్పీటీసీ సభ్యురాలు మరివాడ వెంకట పావని, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ బ్రహ్మం, ఇతర ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

29న హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

కర్లపాలెం: మండలంలోని పాతనందాయపాలెంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను ఈ నెల 29న ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రారంభిస్తారని స్థానిక ప్రజా ప్రతినిధులు కావూరి చిట్టెమ్మ, ఆట్ల వెంకటేశ్వరమ్మ మంగళవారం తెలిపారు. ప్రారంభోత్సవానికి మండల పరిధిలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరవ్వాలని కోరారు.

రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అరెస్ట్



తెనాలిరూరల్: రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని జీఆర్పీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ ఎల్.సరస్వతి మంగళవారం రాత్రి తెలిపారు. ఇటీవలి కాలంలో తెనాలి జీఆర్పీ స్టేషన్‌లో రైళ్లలో చోరీపై రెండు కేసులు నమోదయ్యాయి. సెల్‌ఫోన్‌లు, బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్టు బాధితులు ఫిర్యాదు చేశారు. వీటిని 01/24, 24/24గా నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితులను పొన్నూరుకు చెందిన షేక్ సైదా(ప్రస్తుతం బాపట్లలో నివసిస్తున్నాడు), పొన్నూరుకే చెందిన షేక్‌మస్తాన్‌బీగా గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా బంగారు గొలుసు, మూడు ఉంగరాలు, వజ్రంతో ఉన్న చెవి దిద్దులు, ఐఫోన్ లభించాయి. నిందితులు తెలిపిన సమాచారం మేరకు వస్తువులను స్వాధీనపర్చుకుని వారిని అరెస్ట్ చేశామని ఎస్ఐ వివరించారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.1.54 లక్షలు ఉంటుందని తెలిపారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించండి

ఆర్డీవో హెలా షారోన్



సెక్టారు అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో హెలా షారోన్

రేపల్లె రూరల్: సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పూర్తి వివరాలను సెక్టారు అధికారులు తమకు అందించాలని ఆర్డీవో హెలా షారోన్ ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఎన్నికల నిర్వహణపై సెక్టారు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గత సార్వత్రిక ఎన్నికలలో రేపల్లె సెక్టారు పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో అల్లర్లు జరిగి ఉంటే వాటిని దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. ఆ అల్లర్లకు గల కారణాలను పూర్తి స్థాయిలో తెలుసుకోవాలన్నారు. ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో బలమైన పార్టీ అభ్యర్థులు ఉంటే వారి వివరాలను తమకు నివేదించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో పటిష్ఠ పోలీసు బందోబస్తుతో పాటు లైవ్ వెబ్‌కాస్టింగ్ ఎన్నికలు జరపాలని ఎన్నికల సంఘం ఆదేశించిందన్నారు. వీటితో పాటుగా పోలింగ్ కేంద్రాల రూట్‌ల వివరాలను మ్యాపింగ్ చేసి కార్యాలయంలో అందించాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు 300 మీటర్ల దూరంలో ఉన్న రాజకీయ పార్టీ కార్యాలయాల వివరాలను అందించాలని పేర్కొన్నారు. పలు అంశాలపై చర్చించారు.

ఓటు హక్కు నమోదుకు అవకాశం

అర్హత కలిగిన వారు ఓటు నమోదు చేసుకునేలా ప్రజలకు అధికారులతో పాటు రాజకీయ పార్టీల నాయకులు అవగాహన కల్పించాలని ఆర్డీవో షారోన్ కోరారు. స్థానిక కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గత సమావేశాలలో ఆయా పార్టీల ప్రతినిధులు ప్రస్తావించిన సలహాలు, సూచనలు పరిశీలించి అనుసరిస్తున్నామన్నారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకునేలా అంతా కృషి చేయాలన్నారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన

రేపల్లె రూరల్: అభివృద్ధి కోసం కృషి చేసే నాయకుడిని ఎన్నుకునేందుకు ప్రజల చేతుల్లో ఉన్న వజ్రాయుధమే ఓటు హక్కు అని విజ్ఞాన్ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సాజిద్‌భాషా అన్నారు. పట్టణంలోని విజ్ఞాన్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో అహ్మదీయ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు విద్యార్థులకు మంగళవారం ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండి నూతనంగా ఓటు హక్కు పొందిన వారు సమాజం కోసం కృషి చేసే వారికి మాత్రమే ఓటు వేయాలన్నారు. బంధుప్రీతి, ఇతర ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ తల్లిదండ్రులు, బంధువులు సైతం ఓటు హక్కు వినియోగించుకునేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో అహ్మదీయ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ సెక్రటరీ తాహేర్ అహ్మద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

- వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బొద్దులూరి
- నిడుబ్రోలులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం



శిబిరంలో మాట్లాడుతున్న బొద్దులూరి రంగారావు

పొన్నూరు: పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బొద్దులూరి రంగారావు పేర్కొన్నారు. మంగళవారం పట్టణం నిడుబ్రోలులోని డీఆర్‌కే కాలనీలో రెండో విడత వైఎస్సార్ ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వివిధ ఆరోగ్య సమస్యలపై వచ్చిన ప్రజలకు వైద్య సిబ్బంది పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రంగారావు మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు ఇంటి వద్దకే మెరుగైన వైద్య సేవలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సంక్షేమ పాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మల్లెల రాజు, జంపనాటి శ్రీధర్, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అభ్యంతరాలపై సమగ్ర పరిశీలన

- ఇంటి వద్ద నుంచే ఓటు హక్కుపై విస్తృత ప్రచారం
- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో గుంటూరు ఆర్డీఓ పి.శ్రీకర్



మాట్లాడుతున్న గుంటూరు ఆర్డీఓ పి.శ్రీకర్

ప్రత్తిపాడు: మూడు కేటగిరీల ఓటర్లు తమ ఓటు హక్కును ఇంటి వద్ద నుంచే వినియోగించుకునేలా ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని గుంటూరు ఆర్డీఓ పి. శ్రీకర్ అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆర్డీఓ శ్రీకర్ రాజకీయ పార్టీల నాయకులతో నియోజకవర్గస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఎనభై సంవత్సరాల పైబడిన వారు, పూర్తిగా దివ్యాంగులైన వారు, కోవిడ్‌తో బాధపడుతున్న వారు ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఫారం-12 డిని దరఖాస్తు చేసుకోవాలన్నారు. జెన్యూనిటీని పరిశీలించిన తరువాతే అలాంటి వారికి అనుమతి ఇచ్చి ప్రత్యేక బృందం ద్వారా పోస్టల్ బ్యాలెట్ ఓటుకు అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. ముసాయిదా జాబితా ప్రచురణ తరువాత వచ్చిన ప్రతి ఒక్క అర్జీని క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుదని, ఒకటికి రెండు సార్లు విచారించిన తరువాతనే అర్జీలను క్లోజ్ చేస్తున్నామని చెప్పారు. ఎన్నికల సిబ్బందిని, సామగ్రిని తరలించే మార్గంలో అవాంతరా లున్న రూట్‌ను గుర్తించి, రూట్‌ను మార్చేందుకు ప్రతిపాదనలు జిల్లా కలెక్టర్‌కు పంపించామని ఆర్డీఓ వివరించారు. ఇప్పటికే ఈవీఎంలు జిల్లాకు చేరుకున్నాయని, ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత ర్యాండమ్‌గా నియోజకవర్గానికి కేటాయిస్తారన్నారు. ఈవీఎం, వీవీప్యాట్‌ల పనితీరు వంటి వాటిపై ఇప్పటికే ట్రయల్ రన్ పూర్తి చేశామని, పని తీరును ఆయా రాజకీయ పార్టీల నేతల సమక్షంలో పరిశీలించామని చెప్పారు. గత ఎన్నికల్లో ఎదురైన అనుభవాల దృష్ట్యా పోలింగ్ రోజుల ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 20 శాతం ఈవీఎంలు, ముప్పై శాతం వీవీప్యాట్‌లను అదనంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది అన్ని నూతన ఈవీఎంలు కావడం వలన అలాంటి సమస్యలు ఉత్పన్నం కావడానికి 99 శాతం ఆస్కారం లేదన్నారు.

ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంను వినియోగించుకోండి..

రాజకీయ నాయకులు, ఓటర్లు ఏమైనా ఫిర్యాదులు చేయాలన్నా.. దరఖాస్తులు చేయాలన్నా ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలను వినియోగించుకోవాలని ఆర్డీఓ నాయకులకు సూచించారు. ఎన్నికల ర్యాలీల అనుమతులు, ఇతరత్రా అవసరాలకు ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ యాప్‌లు, వెబ్ పోర్టల్స్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తద్వారా అధికారులు త్వరితగతిన స్పందించడానికి ఆస్కారం ఉంటుందని, అంతేకాకుండా జవాబుదారీతనం కూడా అధికంగా ఉంటుందని చెప్పారు. సమావేశంలో ఆయా మండలాల తహసీల్దార్లు, డీటీలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

తెనాలిరూరల్: వరకట్నం వేధింపులపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఖాజీపేటకు చెందిన పులిగడ్డ దివ్య తనను భర్త శ్రీనివాసరావు అధిక కట్నం తెమ్మంటూ మానసిక, శారీరక వేధింపులకు గురి చేస్తున్నాడని పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు మంగళవారం తెలిపారు.